22012025-DIS-06_Layout 1 1/22/2025 2:44 AM Page 1

నమస్తే తెలంగాణ

ఏపీ జల దోపిడీ

తెలంగాణ నిలిచి కొట్లాడిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసం. ఆ వరుసలో నీటికే ప్రథమ ప్రాధాన్యం అన్నది తెలిసిందే. సమైక్య రాష్ట్రంలో ఓ పథకం ప్రకారమే జల దోపిడీ జరిగింది. స్వరాష్ట్ర సాధన తర్వాత అది కట్టడి అయ్యింది. దార్శనిక నేత కేసీఆర్ పాలనలో తెలంగాణ జలకళ సంతరించుకున్నది. కాళేశ్వరం వంటి అద్వితీయమైన ప్రాజెక్టు సాకారమైంది. నెరెలు వారిన నేల మీద నీరు పారింది. తెలంగాణ తీరు మారింది. కరవు నేల అన్నపూర్ణగా పరిఢవిల్లింది. కానీ మారిన పరిస్థితుల్లో మరోసారి పొరుగు రాష్ట్రం నీటి కుట్రలకు తెరతీసింది. నిన్నటిదాకా ఇటు తొంగిచూసేందుకు జంకినవారు ఇప్పుడు బరి తెగిస్తున్నారు. గోదావరి బనకచర్ల లింకు ద్వారా నీటి మళ్లింపు జరుపనున్నట్టు ఏపీ సీఎం ఇటీవల అట్టహాసంగా ప్రకటించారు. రూ.80 వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మిస్తారట. ఏకంగా 200 టీఎంసీల గోదావరి జలాలను పోలవరం నుంచి పెన్నా బేసిన్‌కు తరలించే ఎత్తుగడ ఇది. నెల్లూరు, ప్రకాశంతో పాటుగా రాయలసీమ జిల్లాలకు నీరు పారించేందుకు ఏపీ సర్కార్ ఆగమేఘాల మీద పథకాలు వేస్తున్నది. నిధుల కోసం ఉరుకులు పరుగులు పెడుతున్నది. నిజానికిది లింకు కాదు గోదావరికి బిగిస్తున్న ఉచ్చు.

నాటి నుంచీ నేటిదాకా నీటి మళ్లింపు కుట్రలు చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు పేరిట కృష్ణా జలాలను చెరబట్టేందుకు ఎత్తులు వేస్తే ఉద్యమ నేతగా కేసీఆర్ తీవ్రంగా ప్రతిఘటించారు. కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకువచ్చి అలుపెరుగని పోరాటం చేశారు. రాష్ట్ర సాధన అనంతరం కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా కోసం నిరంతర జాగరూకతతో ముందుకుసాగారు. ఇప్పుడు గోదావరి జలాలను ఒడిసిపట్టేందుకు చంద్రబాబు పావులు కదుపుతున్నారు. ఇందుకు వరద జలాలను సాకుగా వాడుకుంటున్నారు. వృథాగా 4 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నదని, అందులో 200 టీఎంసీలను మళ్లించుకుంటామని అంటున్నారు. గోదావరి జలాల పంపిణీపై ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డులో వరద ఊసే లేనప్పుడు ఆ పేరు మీద మళ్లింపు ఎలా జరుపుతారనేది ప్రశ్న.

బనకచర్ల లింకుతో గోదావరి జలాలు బేసిన్ బయటకు పోతాయి. దీనివల్ల బేసిన్‌లోని తెలంగాణకు తీరని ముప్పు ఏర్పడుతుందనేది నిర్వివాదాంశం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంతవరకూ ఈ దిశగా అడుగులు వేయడానికి సాహసించని ఏపీ సర్కార్ ఇప్పుడు ఏకంగా దూకుడు పెంచడానికి కారణమేమిటో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇక్కడ తనకు అనుకూలమైన ప్రభుత్వం ఉండటం వారికి కొత్త ఉత్సాహం కలిగిస్తున్నట్టుంది. ఏవో కుంటిసాకులతో కాళేశ్వరాన్ని పండబెట్టాలని తెలంగాణ ప్రభుత్వం చూస్తున్నది. ఆ ప్రాజెక్టుకు ప్రాణాధారమైన ప్రాణహిత జలాలను ఎత్తుకుపోయేందుకు అటు ఏపీ సర్కారు నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా మాయోపాయాలు పన్నుతున్నది. వరద మళ్లింపు పేరిట ఇప్పటికే కృష్ణాను చెరబట్టింది. ఈ ఏడాది ఇప్పటివరకు 594 టీఎంసీలు తరలించింది. తెలంగాణ ఇప్పటికైనా అడ్డుకట్ట వేయకపోతే గోదావరి పరిస్థితీ ఇంతే అవుతుంది.

నిర్బంధాల తెలంగాణ

జ.దేవీప్రసాద్ రావు
90006 33404

'ప్రభుత్వాలను చూసి ప్రజలు భయపడకూడదు.. ప్రజలను చూసి ప్రభుత్వాలు భయపడాలి' అని ఆంగ్ల రచయిత అలెన్‌మూర్ చెప్తే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రభుత్వాన్ని చూసి భయపడాలని ప్రజలను హెచ్చరిస్తున్న వైఖరి దుర్మార్గం. గత 13 నెలలుగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు ప్రజల్ని భయకంపితుల్ని చేస్తున్నాయి. హైడ్రా, మూసీ పేర జరుగుతున్న విధ్వంసం వలన ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఫార్మా కంపెనీ, రామన్నపేట సిమెంట్ ఫ్యాక్టరీ పేరిట జరిగిన నిర్బంధకాండ వల్ల రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ప్రజా సమస్యలపై పోరాడితే ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు, నేతలపై కేసులు, అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తున్నది. హామీలు అమలు చేయాలన్న ఆశా వర్కర్లపై లాఠీచార్జ్ చేస్తున్నారు. గుండెపోటు వచ్చిన లగచర్ల రైతును బేడీలతో దవాఖానకు తీసుకెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని అడిగితే ప్రతిపక్షాల కుట్ర అంటున్నారు. మొత్తంగా ఇదీ తెలంగాణ ముఖచిత్రం. తెలంగాణ వస్తే 10 శాతం మాత్రమే విజయం సాధించినట్టని, మిగతా 90 శాతం పూర్తికావాలంటే నిరంతరం పోరాడాలన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ మాటలు మదిలో ఇంకా మెదులుతూనే ఉన్నాయి.

> **కేసీఆర్ పదేండ్ల పాలన దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపింది. సబ్బండ వర్గాల ఆకాంక్షలే పరిపాలన విధానాలుగా మారి అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల లాగా సాగుతూ పయనించింది. నీటి గోస తీరింది. కరెంట్ కోతలతో తల్లడిల్లిన ప్రజలు నిరంతర వెలుగులను ఆస్వాదించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు తెచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాల న్యాయం కోసం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసింది. కానీ, కేసీఆర్ ప్రభుత్వానికి మించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పడంతో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు.**

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపించింది. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైంది. అనేక ఆంక్షలతో రుణమాఫీని 50 శాతం మాత్రమే అమలు చేశారు. రైతు భరోసా ఎప్పుడిస్తారో తెలియదు. ఎన్నికల్లో ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ. 12 వేలకు కుదించి గొప్పలు చెప్పుకుంటున్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలు ఎగిరిపోయాయి. కేసీఆర్ పథకాలపై విచారణ జరిపిస్తామని చెప్పున్నారు. ఒక్క కొత్త పథకమూ రాలేదు సరికదా, ఉన్న పథకాలను కూడా సరిగా అమలు చేయడం లేదు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలన్న ఉద్దేశంతో రెసిడెన్షియల్ విద్యను రేవంత్ ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నది. గురుకులాల్లో సరైన పర్యవేక్షణ లేక 13 నెలల్లో 50 మందికిపైగా విద్యార్థులు చనిపోయారు. విద్యను సంక్షోభంలోకి నెట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి.

సమైక్య పాలనలో యువత వలస బాట పట్టారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు. తెలంగాణ పల్లెల్లో కొత్త వెలుగులు నింపారు. వలస వెళ్లిన వారు తిరిగొచ్చి వ్యవసాయం చేసుకుంటూ రాష్ట్ర సాధన ఫలాలు అందుకున్నారు. దేశంలోనే తొలిసారిగా రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చి రైతులకు కేసీఆర్ అండగా నిలిచారు. సాగునీటి కోసం కాకతీయ మిషన్, ప్రాజెక్టులు నిర్మించి నీటి వసతి కల్పించారు. ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేస్తూ నాణ్యమైన కరెంటును నిరంతరాయంగా అందించారు. అలా పదేండ్లపాటు రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దితే కాంగ్రెస్ 13 నెలల్లోనే సంక్షోభంలోకి నెట్టేసింది. రైతులను పూర్తిగా కష్టాల్లో ముంచింది. ఫార్మా కంపెనీలు, సిమెంట్ కంపెనీలకు వేలాది ఎకరాల వ్యవసాయ భూములను అప్పగించి రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. లగచర్ల రైతులు ఎదురు తిరిగితే అరెస్టులు, జైళ్లు, నిర్బంధాలతో పోలీసు రాజ్యంగా మార్చారు. అదానీ, అంబానీలను ఢిల్లీలో వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మాత్రం వారికి నజరానాలు ప్రకటిస్తుండటం

గమనార్హం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని చెప్పి ఏడో గ్యారెంటీగా నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని కూడా నిర్బంధిస్తున్నారు. ఇక, హామీల అమలుకు పోరాడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను అరెస్ట్ చేస్తున్నారు. గృహనిర్బంధాలు సర్వసాధారణమయ్యాయి.

ఎన్‌కౌంటర్లతో తెలంగాణ మళ్లీ ఎరుపెక్కింది. 13 నెల్లలో 16 మందిని చంపారు. కిడ్నాప్‌లు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి. పోలీసు వ్యవస్థను కాంగ్రెస్ తన సొంత సైన్యంలా వాడుకుంటున్నది. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల హామీ అటకెక్కింది. కేసీఆర్ ప్రభుత్వం పూర్తిచేసిన ఉద్యోగాల ప్రక్రియలో మిగిలిపోయిన 40 వేల ఉద్యోగాలను భర్తీచేసి తమ ఖాతాలో వేసుకున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. ఆర్థిక ఇబ్బందులను బూచిగా చూపిస్తూ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారు. హామీల గురించి ప్రశ్నించినప్పుడల్లా కేసీఆర్ ప్రభుతం రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసిందని చెప్తూ తప్పించుకుంటున్నారు.

> **2014-15లో రూ. లక్ష కోట్లు ఉన్న రాష్ట్ర బడ్జెట్ కేసీఆర్ పదేండ్ల కాలంలో మూడు రెట్లు పెరిగి రూ. లక్షల కోట్లకు చేరింది. తలసరి ఆదాయంలో 2014-15లో రూ.1,03,889 ఉండగా 2023-24లో రూ. 3,56,564కు పెరిగింది. సొంత పన్నుల రాబడి రూ.29 వేల కోట్ల నుంచి పదేండ్లలో రూ.1.36 లక్షల కోట్లకు పెరగడం కేసీఆర్ పరిపాలన విజయం.**

రాష్ట్ర జీఎస్డీపీ రూ. 4.3 లక్షల కోట్ల నుంచి పదేండ్లలో రూ.15.01 లక్షల కోట్లకు పెరగడం కేసీఆర్ పరిపాలన దక్షత కాదా? కేవలం రూ. 4.17 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపారు. రాష్ట్రంలోని అన్ని రంగాల పునర్నిర్మాణం కోసం వేల కోట్లు పెట్టుబడులు పెట్టి ఆస్తులు సృష్టించి అభివృద్ధి చేసింది వాస్తవం. అప్పులు మాత్రమే చెప్పి జరిగిన ఆర్థిక అభివృద్ధిని కుట్రపూరితంగా దాచివేసి కేసీఆర్ పరిపాలన విజయాలను తుడిచేసే వెకిలి ప్రయత్నం జరుగుతున్నది. తలసరి విద్యుత్తు వినియోగంలో 1,151 యూనిట్ల నుంచి 1,748 యూనిట్లకు చేరుకున్నాం. పదేండ్లలో రూ. 97,321 వేల కోట్లు వెచ్చించి విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థల విస్తరణ, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసి చీకటి తెలంగాణను వెలుగుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.

> **జయశంకర్ సార్ చెప్పినట్టు తెలంగాణ కథ వొడవని ముచ్చట. పదేండ్ల వికాసాన్ని విధ్వంసంగా మాపే పిచ్చి ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తున్నది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిఘా సంస్థలు నిత్యం నిఘా వేసి, వారిపై అవినీతి ముద్ర వేయాలని చూస్తున్నాయి. వారిని ఎలాగైనా జైలుకు పంపి బీఆర్ఎస్ నాయకుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా చేయాలని కుట్ర చేస్తున్నారు.**

కవితను అక్రమంగా అరెస్ట్ చేసి క్షణికానందం పొందిన బీజేపీకి, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం. 60 లక్షల మంది సభ్యత్వం ఉన్న బీఆర్ఎస్‌లో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అందరం కలిసి ఎదుర్కొంటామని హరీశ్‌రావు ప్రకటించి పార్టీ శ్రేణులకు కొండంత ధైర్యం కల్పించారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ ర్యాలీ చేస్తానని అంటుంటే.. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటామని, మరిన్ని ఫిరాయింపులు ఉంటాయని రాజ్యాంగ ఉల్లంఘన ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 13 నెలలుగా బీఆర్ఎస్ పోరాడుతున్న తీరు ప్రజలకు కొండంత విశ్వాసాన్ని కలిగించింది. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొని విజయం సాధించిన చరిత్ర మన కండ్ల ముందు ఉన్నది. 2001 నుంచి బీఆర్ఎస్ ఎదుర్కొన్న ఇబ్బందులు, తెలంగాణ ఉద్యమంలో అనుభవించిన నిర్బంధం నుంచి నేర్చుకున్న పోరాట స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొని ముందుకు సాగడమే మన కర్తవ్యం. ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని ప్రజల పక్షాన పోరాడటం ద్వారా వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోదాం.

(వ్యాసకర్త: కార్పొరేషన్ మాజీ చైర్మన్)

నర్సన్ బద్రి
94401 28169

అటు సయ్యాటలు, ఇటు చెట్టాపట్టాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారంగానే సాగుతున్నట్టుగా కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్‌లోని సీనియర్లను పక్కనబెట్టి పూర్తిగా రేవంత్‌రెడ్డిని నమ్ముకొని ముందుకుసాగుతున్న అధిష్ఠానం ఆయనకు పగ్గాలు వేయలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నది. కాంగ్రెస్ బ్లడ్ కాని రేవంత్‌తో అధిష్ఠానం తాము కోరుకున్న ఫలితాలను రాబట్టుకోలేకపోతున్నదనే చెప్పాలి. ఈ నెల 15న ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ మంత్రుల భేటీలో ఇలాంటి ఎన్నో అంశాలు చర్చలోకి వచ్చాయి. ఏడాది పాలనపై ఢిల్లీలో జరిగిన ఈ సమీక్షలో రేవంత్ బృందంలో ఏకాభిప్రాయం లేని విషయం కూడా చర్చకు వచ్చింది. జనవరి 8 నాడు గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కూడా ఆయన ముఖ్యమంత్రి, మంత్రివర్గం కలిసి పనిచేయడం లేదనే అభిప్రాయం వ్యక్తపరిచారు. ఇప్పటికీ వారి మధ్య సమన్వయం కుదరలేదని ఆయన అభిప్రాయపడ్డారు.

అందుకు ఉదాహరణలుగా ఆయన కొన్ని విషయాలను లేవనెత్తారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పాలనపై చేస్తున్న విమర్శలకు మంత్రులు ధీటుగా సమాధానాన్ని చెప్పడం లేదు. పథకాల అమలుపై వస్తున్న విమర్శల విషయంలో సీఎం ఒంటరిగా పోరాడవలసి వస్తున్నది. వీరి మౌనం రేవంత్ నిర్ణయాల పట్ల మంత్రివర్గంలో ఏకీభావం లేనట్టుగా అందరు భావిస్తారని వేణుగోపాల్ అన్నారు. మంత్రుల సర్దుబాటు మాటలతో ఆయన సంతృప్తి చెందినట్టు తెలిసింది. బీఆర్ఎస్ నేతల విమర్శలకు కొందరు జవాబులు ఇచ్చినా బీజేపీ పట్ల మంత్రులు, నాయకులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆయన తప్పు బట్టారు. కేంద్రంలోని బీజేపీ పాలసీలతో రాష్ట్రంలోని మంత్రులు సంబంధం లేనట్టుగా ఉంటున్నారు. దీనివల్ల అర్థాలు మారిపోతాయి. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు స్థానిక బీజేపీ నేతలతో కేంద్రాన్ని దృష్టిలో పెట్టుకొని నడవాలి కానీ, అలా జరగడం లేదు. ఇటీవల మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు పుస్తకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పార్టీ వైఖరిని మరిచినట్టు మాట్లాడారు. బీజేపీ పాతకాపు అయిన విద్యాసాగర్ రావుపై రేవంత్ ప్రశంసల జల్లు కురిపించారు. ఇలా చాలా సందర్భాల్లో రేవంత్ కాంగ్రెస్ కట్టుబాటు తప్పుతున్నారు. వాస్తవానికి కేంద్రంలోని బీజేపీ పాలనను కాంగ్రెస్ కార్యకర్తలుగా రాష్ట్రస్థాయిలో కూడా నిలదీయవలసిన అవసరం ఎంతో ఉన్నది. అలా లేకుంటే రాష్ట్రంలోని బీజేపీ నేతలతో కాంగ్రెస్ నాయకులు కలుపుగోలుగా ఉంటున్నారనే అపవాదు మోయవలసి వస్తున్నది. కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ప్రతినిధులుగా రాష్ట్రంలో కూడా వ్యవహరించవలసిన అవసరం ఉన్నది. అయితే, ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలే బీజేపీ వైఖరిని ఎదుర్కొంటారు అన్నట్టు వీరు వదిలేస్తున్నారు.

అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అవమానిస్తున్నట్టు మాట్లాడినా తెలంగాణ కాంగ్రెస్ నేతల నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. ఇది అధిష్ఠానానికి మింగుడుపడలేదు. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని అధిష్ఠానం వీరికి గుర్తు చేయవలసి వస్తున్నది. ఫార్ములా వన్ రేస్ నిర్వహణకు జరిగిన చెల్లింపులో నిబంధనలు ఉల్లంఘించారనే అభియోగంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను ఏసీబీ కేసు వేసిన సమయంలో ఈడీ కూడా రంగప్రవేశం చేసింది. గంటల తరబడి ఈడీ, ఏసీబీల విచారణకు బదులు ఇద్దరం లై డిటెక్టర్ పరీక్షను ఎదుర్కొందామని కేటీఆర్ సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ మూకుమ్మడిగా బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్న తీరు చూస్తుంటే రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ కలిసి అడుగేస్తున్నట్టుగా భావించవచ్చు.



మరోవైపు హైదరాబాద్ పాతబస్తీలో ఫ్లై ఓవర్ ప్రారంభించినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంఐఎం నాయకులను ప్రశంసించడం, వెనుకేసుకురావడం పట్ల కొందరు కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ దృష్టికి లోపాయికారిగా తెచ్చినట్టు తెలుస్తున్నది. ఆ వైఖరి వల్ల కాంగ్రెస్‌లోని ముస్లిం నాయకులు నిరాశ చెందుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమికి కారణమైన ఎంఐఎంతో రేవంత్ చెట్టాపట్టాలు వేసుకోవడం కూడా అధిష్ఠానానికి మింగుడు పడని విషయమే. పైకి పార్టీ పట్ల వినమ్రంగా కనిపించినా ప్రతి సందర్భంలోనూ రేవంత్ సొంత వైఖరితో వ్యవహరిస్తున్నారు. ఇది పార్టీకి నష్టం చేస్తుందని తెలిసినా ఏమీ చేయలేని స్థితి అధిష్ఠానానిది.

జనవరి 26న జాతీయస్థాయిలో మొదలయ్యే రాహుల్‌గాంధీ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు రాష్ట్రం సంసిద్ధత ఉండాలనేది కూడా ఢిల్లీ మీట్‌లో ప్రధాన విషయమే. రాహుల్‌గాంధీ పాదయాత్ర ఇప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి, మరీ ముఖ్యంగా రేవంత్ రెడ్డికి ఒక పరీక్షగానే భావించాలి. ఎందుకంటే బీఆర్ఎస్ జెండాపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. గులాబీ గుర్తుపై గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తాను కాంగ్రెస్ వాడినని ప్రకటించడంతో పెద్ద రగడ మొదలైంది. ప్రతి ప్రభుత్వ సమావేశంలో ఆయన సొంత శాసనసభ్యుల మధ్య భంగపడే పరిస్థితి ఏర్పడింది. కడుపు మండిన ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండబట్టలేక ఆయనను కరీంనగర్‌లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో 'తమరిది ఏ పార్టీ?' అని నిలదీయడంతో పెద్ద గొడవే అయింది. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా లేని ఆ ఎమ్మెల్యే తప్పని పరిస్థితుల్లో తాను కాంగ్రెస్ తరపున వచ్చానని చెప్పక తప్పలేదు. ఇలాంటి సందర్భంలో రాహుల్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర రాష్ట్రంలో అబాసుపాలు కావచ్చు. చిన్న రాజ్యాంగ ప్రతిని పట్టుకొని పార్లమెంట్‌లో కనబడుతున్న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘనను తప్పుబట్టడం లేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఒక పాత్ర, పాలనలో ఉన్న చోట దానికి భిన్నమైన పాత్ర పోషించడంతో ఆయనకు రాజ్యాంగంపై ఉన్న గౌరవం బయటపడుతున్నది. ఇదే ప్రశ్న తెలంగాణలో ప్రతిపక్షాలు ఆయనను ప్రశ్నించే అవకాశం ఎంతో ఉన్నది. ఇలా రాష్ట్రం తమదే అన్న భావన కాంగ్రెస్ పెద్దలకు కలుగకుండా సాగుతున్న రేవంత్ వైఖరిని వారు భరించక తప్పదు. ■



ఆయుర్వేద మందుల వల్లే ముఖ్యమంత్రిని అయ్యాను!

ఆయుర్వేద ఔషధాలు మంచివే అయినా నిదానంగా పనిచేస్తాయని ప్రజలంటారు. కానీ నా విషయంలో అవి చాలా వేగంగా పనిచేశాయి. వాటిని తీసుకోవడం వల్లే నేను ఉన్నత విద్యాశాఖ మంత్రి నుంచి ముఖ్యమంత్రిని అయ్యాను.

- మోహన్ యాదవ్
మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

భారత్‌పై చైనా ట్రేడ్‌వార్

భారత్‌కు చైనా నుంచి ముప్పు ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఇది మరోమారు నిరూపితమైంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యలను సహేతుకంగా, న్యాయంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్దామని, పరస్పరం అర్థం చేసుకుని మసలుకుందామని ఆరు పాయింట్లతో ఒప్పందం చేసుకున్న చైనా మరోవైపు పన్నాగాలకు పదునుపెడుతున్నది. శరవేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్‌ను దెబ్బకొట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నది. అందులో భాగంగా వాణిజ్య యుద్ధానికి తెరతీసింది. భారత్ దిగుమతి చేసుకునే కీలక పరికరాలు, యంత్రాలపై అప్రకటిత ఆంక్షలు విధించింది. భారత్‌లోని అనేక రంగాలు చైనా ఎగుమతులపైనే ఆధారపడి నడుస్తున్నాయి. ఇప్పుడీ ఆంక్షల కారణంగా వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడింది. భారత్‌లోని ఎలక్ట్రానిక్, బల్క్‌డ్రగ్, సోలార్ పరిశ్రమలు దాదాపుగా చైనాపైనే ఆధారపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడివి సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన కనిపిస్తున్నది. అలాగే, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో అత్యంత కీలకమైన లిథియం అయాన్ బ్యాటరీ సాంకేతికతను బదిలీ చేసేందుకు చైనా నిరాకరిస్తున్నది.

డ్రాగన్ ఆంక్షలు భారత ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నది. వీటి కారణంగా భారత్‌లో ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఫలితంగా దేశీయ మార్కెట్లో ద్రవ్యోల్బణం కోరలు చాస్తుంది. చైనా ఆంక్షల వెనకున్న కారణం ఏమైనప్పటికీ ఇండియాలోని మొబైల్ ఫోన్ పరిశ్రమతోపాటు చైనాపై దాదాపు 100 శాతం ఆధారపడే బల్క్‌డ్రగ్ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి రావచ్చు. బల్క్‌డ్రగ్ ఎగుమతులపై చైనీయులు ఒత్తిడి తీసుకొస్తే కనుక భారత్‌లో యాంటీబయాటిక్స్ వంటి చౌక ఔషధాల విషయంలో విపత్తు ఎదుర్కోక తప్పదు. అదే జరిగితే భారత్ దీనిని ఎలా ఎదుర్కొంటుందనేది ప్రశ్నార్థకమే.

భారత్‌పై చైనా ఆంక్షలకు ఎలాంటి కారణాలు లేవన్నది నిజం. భారత్‌తో ఈ అప్రకటిత వాణిజ్య యుద్ధాన్ని ముగించేందుకు చైనా కొన్ని షరతులు కూడా విధించినట్టు తెలిసింది. 'క్వాడ్' కూటమి నుంచి వైదొలుగుతామని భారత్ కచ్చితమైన హామీనివ్వడం, ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన గల్వాన్ వద్ద 2020 జూన్ నాటికి ముందున్న పరిస్థితిని తీసుకొచ్చేందుకు దళాల ఉపసంహరణ వంటివి ఇందులో కొన్ని. గల్వాన్ ఘర్షణలో భారత్ 20 మంది సైనికులను కోల్పోయింది. చైనా వైపు నష్టం బయటకు రాకున్నా అంతకుమించి నష్టం జరిగి ఉంటుందన్న వార్తలు వచ్చాయి.

భారత్-చైనా మధ్య సంబంధాలు పూర్వ స్థితికి రావాలంటే ఇరు దేశాల మధ్య తొలుత విమాన సర్వీసుల పునరుద్ధరణ జరగాలని, వీసాల జారీని సులభతరం చేయడంతోపాటు టిక్‌టాక్ వంటి చైనా యాప్‌లపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలన్నది చైనా ప్రధాన డిమాండ్. కరోనా సమయంలో ఇరు దేశాల మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులు పునరుద్ధరణకు నోచుకోలేదు. చైనా కోపానికి మరో కారణం కూడా ఉన్నది. భారత్‌లోని తమ మొబైల్ కంపెనీలు షావోమీ, వివో, ఒప్పో వంటివాటిపై ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు